సాక్షి
శ్రీసత్యసాయి జిల్లా

ఆదివారం । 3 । మార్చి । 2024



చీనీ టన్ను రూ.16 వేలు
అనంతపురం వ్యవసాయ మార్కెట్‌యార్డులో శనివారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.16 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సరాసరిన రూ.13 వేల ప్రకారం పలికాయి.



టమాట కిలో రూ.10
అనంత శివారు కక్కలపల్లి మండీలో శనివారం కిలో టమాట గరిష్టంగా రూ.10 ధర పలికింది. మార్కెట్‌కు 320 టన్నుల కాయలు వచ్చాయి.



జిల్లాలో శనివారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. వేకువజామున పలు చోట్ల చలి వాతావరణం నెలకొంది. తూర్పు దిశగా గంటకు 6 నుంచి 10 కిలో మీటర్ల వేగంతో గాలి వీచింది.

న్యూస్‌రీల్

'ప్రైవేటు'లో ఉచిత విద్యకు దరఖాస్తు చేసుకోండి



కార్యాలయ ఆవరణలో నోటీసు బోర్డును ప్రదర్శిస్తున్న డీఈఓ మీనాక్షి, సిబ్బంది

పుట్టపర్తి: విద్యాహక్కు చట్టం ప్రకారం జిల్లాలోని ప్రైవేటు, ఎయిడెడ్ పాఠశాలల్లోనూ అర్హులైన నిరుపేద కుటుంబాల్లోని విద్యార్థులకు ఉచిత విద్య అందించేందుకు అధికారులు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్, దివ్యాంగ కేటగిరీ విద్యార్థులకు ప్రతి పాఠశాలలోనూ 1వ తరగతిలో 25 శాతం సీట్లు ఇచ్చేలా ప్రభుత్వం జీఓ విడుదల చేసిందని డీఈఓ మీనాక్షి తెలిపారు. ఈ మేరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ఎయిడెడ్ స్కూళ్లలో ఆయా వర్గాల చిన్నారులకు సీట్లు కేటాయించనున్నట్లు ఆమె వెల్లడించారు. 25 శాతం సీట్లలో అనాథ, హెచ్‌ఐవీ, దివ్యాంగుల కేటగిరీ విద్యార్థులకు 5 శాతం, ఎస్సీ వర్గాలకు 10 శాతం, ఎస్టీ వర్గాలకు 4 శాతం, బీసీ, మైనార్టీ, ఈడబ్ల్యూఎస్ వర్గాలకు 6 శాతం సీట్లు కేటాయించనున్నట్లు వెల్లడించారు. ఈ మేరకు కొత్తచెరువులోని డీఈఓ కార్యాలయం ఆవరణలో బోర్డు ఏర్పాటు చేసి వివరాలు పొందుపరిచినట్లు వెల్లడించారు. అర్హులు ఈ నెల 5 నుంచి 25వ తేదీ వరకూ http:||cse.ap.gov.in వెబ్‌సైట్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు.

రేపు వీఏహెచ్‌ఏలకు నియామక ఉత్తర్వులు

- ఉమ్మడి జిల్లాలో 439 మందికి ఉద్యోగాలు




జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయం

అనంతపురం అగ్రికల్చర్: విలేజ్ అనిమల్ హస్బెండరీ అసిస్టెంట్స్ (వీఏహెచ్‌ఏ) పోస్టులకు ఎంపికైన వారికి సోమవారం కలెక్టర్ గౌతమి చేతుల మీదుగా నియామక ఉత్తర్వులు అందజేయనున్నట్లు రెండు జిల్లాల జేడీలు డాక్టర్ వై.సుబ్రహ్మణ్యం, డాక్టర్ బి.శుభదాస్ శనివారం తెలిపారు. 439 మందికి ప్లేస్‌మెంట్లు కూడా ఖరారు చేసినట్లు పేర్కొన్నారు. నియామక పత్రాలు తీసుకున్న తర్వాత 15 రోజుల్లోపు విధుల్లో చేరాల్సి ఉంటుందన్నారు. ప్రభుత్వ కొలువులు దక్కనుండటంతో వందలాది మంది వీఏహెచ్‌ఏ అభ్యర్థులు హర్షాతిరేకం వ్యక్తం చేస్తున్నారు.

రబీ వేరుశనగకు 'మద్దతు'

- క్వింటాకు రూ.6,377 ధర నిర్ణయించిన ప్రభుత్వం
- నేటి నుంచి ఆర్బీకేల్లో రిజిస్ట్రేషన్లకు అవకాశం



పుట్టపర్తి అర్బన్: జిల్లాలో రైతులు రబీలో పండించిన వేరుశనగను మద్దతు ధరతో కొనుగోలు చేయనున్నట్లు మార్క్‌ఫెడ్ జిల్లా మేనేజర్ గీతమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వం క్వింటా వేరుశనగకు రూ.6,377 కనీస మద్దతు ధర (ఎంఎస్‌పీ) నిర్ణయించిందన్నారు. ఆదివారం నుంచి ఆర్‌బీకే వేదికగా రిజిస్ట్రేషన్ల ప్రక్రియ చేపట్టినట్లు తెలిపారు. త్వరలోనే కొనుగోళ్ల ప్రక్రియ ప్రారంభిస్తామన్నారు. పంట సాగు చేసినట్లు ఈ–క్రాప్‌లో నమోదు చేసుకున్న రైతుల ఉత్పత్తులు మాత్రమే కొనుగోలు చేస్తామన్నారు. గ్రామంలోని ఆర్బీకే అసిస్టెంట్లను సంప్రదించి వివరాలు నమోదు చేసుకోవాలని రైతులకు సూచించారు.



ధర్మవరం మండలం నేలకోట గ్రామంలోని వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్ | మడకశిర మండలం మెళవాయి గ్రామ రైతు భరోసా కేంద్రం | పుట్టపర్తి మండలం చెర్లోపల్లి గ్రామ సచివాలయం

గ్రామ స్వరాజ్యం సాకారం

ఊరూరా ప్రభుత్వ ఆస్తులు

- సచివాలయాలతో గ్రామాల్లోనే సమస్యలకు చెక్
- రైతు భరోసా కేంద్రాలతో అన్నదాతలకు అభయం
- వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లతో ప్రాథమిక వైద్యానికి జీవం
- పాలనను కొత్త పుంతలు తొక్కించి ప్రజలకు భరోసా కల్పించిన సీఎం జగన్

సాక్షి ప్రతినిధి, అనంతపురం: మహాత్ముడు కలలు గన్న గ్రామ స్వరాజ్యాన్ని సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి సాకారం చేశారు. ఊరూరా ప్రభుత్వ శాశ్వత భవనాలు నిర్మించి ప్రజల ముంగిటకే పాలనను తీసుకెళ్లారు. అధికారం చేపట్టిన ఏడాదిలోనే గ్రామ/వార్డు సచివాలయ వ్యవస్థను అమల్లోకి తెచ్చి పాలనను కొత్త పుంతలు తొక్కించారు. ప్రతి రెండు వేల మంది జనాభాకు ఒక గ్రామ/వార్డు సచివాలయం ఏర్పాటు చేసి ప్రభుత్వ ఫలాలు నేరుగా గడప వద్దకే చేర్చారు. గతంలో ఎన్నడూ లేని విధంగా అన్నదాతల అవస్థలకు చెక్ పెడుతూ రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేశారు. వైఎస్సార్ హెల్త్ క్లినిక్‌లు నిర్మించి ప్రాథమిక వైద్యానికి జీవం పోశారు. ఒక్కో గ్రామ వార్డు సచివాలయం నిర్మాణానికి రూ.40 లక్షలు, రైతు భరోసా కేంద్రానికి రూ.21.80 లక్షలు, వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్‌కు రూ.20.20 లక్షలు లెక్కన అనంతపురం జిల్లాలో రూ.305 కోట్లు భవన నిర్మాణాలకే ఖర్చు చేశారు. శ్రీ సత్యసాయి జిల్లాలో రూ.236.84 కోట్లతో భవన నిర్మాణాలు చేపట్టారు.

కుర్చీలు కూడా లేని రోజుల నుంచి

గతంలో పాలకులెవరూ ప్రభుత్వ భవనాల గురించి ఆలోచన కూడా చేయలేదు. అధ్వాన స్థితికి చేరినా మార్చిన దాఖలాలు లేవు. టీడీపీ హయాంలో అయితే పరిస్థితి ఘోరంగా ఉండేది. ప్రభుత్వ భవనాల్లో మౌలిక వసతులు కల్పించాలని అధికారులు ఎన్నో సార్లు మొరపెట్టుకున్నా చంద్రబాబు పట్టించుకోలేదు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సామాజిక ఆరోగ్యకేంద్రాలు కూలిపోయే దశకు చేరినా కనీస మరమ్మతులు చేయలేదు. ఆరోగ్య ఉపకేంద్రాల్లో ఏఎన్‌ఎంలకు కుర్చీలు కూడా ఉండేది కాదు. ఈ దశలోనే సీఎంగా బాధ్యతలు చేపట్టిన వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి పాలన స్వరూపాన్నే మార్చివేశారు. ప్రజలు ఉంటున్న ప్రాంతంలోనే సమస్యలకు పరిష్కారం లభించేలా చర్యలు తీసుకున్నారు.

ఉమ్మడి జిల్లాలో ప్రభుత్వ భవనాలు ఇలా

అనంతపురం జిల్లాలో....	
గ్రామ/వార్డు సచివాలయాలు	430
పూర్తయినవి	341
ప్రారంభించినవి	289
మొత్తం రైతు భరోసా కేంద్రాలు	362
పూర్తయినవి	294
ప్రారంభించినవి	241
మొత్తం వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్	268
నిర్మాణం పూర్తయినవి	196
ప్రారంభించినవి	151

శ్రీ సత్యసాయి జిల్లాలో..	
గ్రామ/వార్డు సచివాలయాలు	351
నిర్మాణం పూర్తయినవి	186
ప్రారంభించినవి	108
మొత్తం రైతు భరోసా కేంద్రాలు	271
నిర్మాణం పూర్తయినవి	169
ప్రారంభించినవి	97
మొత్తం వైఎస్సార్ హెల్త్ క్లినిక్స్	185
నిర్మానం పూర్తయినవి	95
ప్రారంభించినవి	43

అనంతలో భవనాల నిర్మాణానికి వ్యయం

కేటగిరీ	సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
గ్రామ/వార్డు సచివాలయాలు	430	172
రైతు భరోసా కేంద్రాలు	362	78.91
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్	268	54.13

శ్రీ సత్యసాయి జిల్లాలో భవనాల నిర్మాణానికి వ్యయం

కేటగిరీ	సంఖ్య	వ్యయం (రూ.కోట్లలో)
గ్రామ/వార్డు సచివాలయాలు	351	140.40
రైతు భరోసా కేంద్రాలు	271	59.07
వైఎస్సార్ విలేజ్ హెల్త్ క్లినిక్స్	185	37.37

ముంగిళ్లలో సేవలు



సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన సచివాలయ వ్యవస్థతో ముంగిళ్లలోనే సేవలు అందుతున్నాయి. గతంలో ఏదైనా పథకం కోసం దరఖాస్తు చేసుకోవాలన్నా, సమస్య తెలుపుకుందామన్నా... మైళ్ల దూరం వెళ్లి తహసీల్దార్ కార్యాలయంలో పడిగాపులు కాయాల్సి వచ్చేది. నేడు అలాంటి పరిస్థితి లేదు. నవరత్నాలతో పాటు 500పైచిలుకు సేవలన్నీ గ్రామ సచివాలయాల ద్వారా అందుబాటులోకి వచ్చాయి.

– శ్రీచందన, బుచ్చయ్యగారిపల్లి, బుక్కపట్నం మండలం

రైతుకు ఇబ్బందులు తప్పాయి



విత్తనాలు కావాలంటే గతంలో పనులు మానుకొని కార్యాలయాల చుట్టూ తిరగాల్సి వచ్చేది. కానీ జగన్ సీఎం అయ్యాక గ్రామంలోనే రైతు భరోసా కేంద్రం ఏర్పాటు చేసి ఎరువులు, విత్తనాలు పంపిణీ చేస్తున్నారు. ఆర్బీకేలో పేర్లు నమోదు చేసుకుంటే... మరుసటి రోజే విత్తనం అందిస్తున్నారు. పంటల సాగులో సలహాలూ ఇస్తున్నారు. ఇలాంటి వ్యవస్థ దేశంలో ఏ రాష్ట్రంలోనూ లేదు. ఇలాంటి సేవలు మాకు అందుబాటులో లేవని సమీపంలోని కర్ణాటక రైతులు తరచూ మాతో అంటుంటారు.

– హనుమంతరాయప్ప, రైతు, టీడీ పల్లి గ్రామం, రొళ్ల మండలం

ఇంటి పట్టాల రిజిస్ట్రేషన్ ముమ్మరం

- ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీ 80 శాతం పూర్తి
- రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి తెలిపిన కలెక్టర్ అరుణ్‌బాబు



వీసీలో పాల్గొన్న కలెక్టర్ అరుణ్‌బాబు, జేసీ అభిషేక్‌కుమార్

పుట్టపర్తి అర్బన్: ప్రభుత్వం మంజూరు చేసిన ఇంటి పట్టాలను లబ్ధిదారుల పేరిట రిజిస్ట్రేషన్ చేసే ప్రక్రియ జిల్లాలో ముమ్మరంగా సాగుతోందని, ఇప్పటికే 82 శాతం పట్టాలు రిజిస్ట్రేషన్ చేశామని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కేఎస్ జవహర్ రెడ్డికి కలెక్టర్ అరుణ్‌బాబు తెలిపారు. మిగిలిన 18 శాతం రిజిస్ట్రేషన్ ప్రక్రియ వెంటనే పూర్తి చేస్తామన్నారు. శనివారం సీఎస్ విజయవాడ నుంచి రెవెన్యూ, రీ–సర్వే, ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ, కరువు మండలాల్లో ఉపాధి పనులు, పరిశ్రమల శాఖకు భూ కేటాయింపు, ఆరోగ్య సురక్ష, పల్స్‌పోలియో తదితర అంశాలపై కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాకు 4,92,211 ఆరోగ్యశ్రీ కార్డులు రాగా, వాటిని ఈ–కేవైసీ చేసి 4,00,451 కార్డులు పంపిణీ చేశామన్నారు. తక్కిన కార్డులు రెండురోజుల్లోపు పంపిణీ చేస్తామన్నారు. ఉపాధి హామీ పనులకు కూలీలు బాగా హాజరవుతున్నారన్నారు. పల్స్ పోలియో కార్యక్రమానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామన్నారు. సమావేశంలో జాయింట్ కలెక్టర్ అభిషేక్ కుమార్, డీఆర్‌డీఏ పీడీ నరసయ్య, పీఆర్ ఎస్‌ఈ గోపాల్‌రెడ్డి, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి సుబ్బారావు, డీపీఓ విజయ్‌కుమార్, జిల్లా వైద్య, ఆరోగ్యశాఖ అధికారి కృష్ణారెడ్డి, సీపీఓ విజయ్ కుమార్, సర్వే అండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ రామకృష్ణన్, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

92 శాతం పింఛన్ల పంపిణీ



అనంతపురంలో ఉన్న అంధురాలు నాగేశ్వరికి పింఛన్ అందజేస్తున్న పుట్టపర్తి మండలం వెంగళమ్మచెరువు వలంటీర్ అనిత

పుట్టపర్తి అర్బన్: సామాజిక భద్రత కింద అందించే 'వైఎస్సార్ పింఛన్ కానుక' పంపిణీ జిల్లాలో జోరుగా సాగుతోంది. తొలిరోజు ఇంటింటికీ వెళ్లి పింఛన్ పంపిణీ చేసిన వలంటీర్లు... రెండోరోజూ శనివారం సుదూర ప్రాంతాల్లో, వివిధ జబ్బులతో బాధపడుతూ ఆస్పత్రుల్లో ఉన్న వారి వద్దకే వెళ్లి పింఛన్ మొత్తం అందించారు. ఫలితంగా జిల్లాలో 92 శాతం పంపిణీ పూర్తయ్యింది. జిల్లాలో 2,73,627 మంది పింఛన్ లబ్ధిదారులుండగా, ప్రభుత్వం రూ.81,67,37,500 మంజూరు చేసింది. శనివారం నాటికి వలంటీర్లు 2,52,188 మందికి రూ.75,25,39,500 మొత్తం అందించారు. పింఛన్ పంపిణీకి మరో మూడు రోజుల గడువు ఉందని, తప్పకుండా వందశాతం పంపిణీ పూర్తి చేస్తామని డీఆర్‌డీఏ పీడీ నరసయ్య తెలిపారు.

ఆ ఒక్కటీ కష్టమే!

- టీడీపీ అంచనాలు తారుమారు
- అభ్యర్థుల ప్రకటన తర్వాత శ్రేణుల్లో నిరుత్సాహం
- వైఎస్సార్ సీపీలోకి పెరిగిన వలసలు
- ఎన్నికలకు ముందే చేతులెత్తేసిన 'తమ్ముళ్లు'



సాక్షి, పుట్టపర్తి

సార్వత్రిక ఎన్నికల వేళ జిల్లాలో టీడీపీ నేతలు చేష్టలుడిగి చూస్తున్నారు. పైకి మేకపోతు గాంభీర్యం ప్రదర్శిస్తున్నా... ఎన్నికల్లో ఎలా గట్టెక్కాలో తెలియక లోలోన సతమతమవుతున్నారు. అభ్యర్థుల ప్రకటన తర్వాత పార్టీని వీడుతున్న వారి సంఖ్య రోజురోజుకూ పెరిగిపోతుండగా, అందరిలోనూ ఆందోళన నెలకొంది. మడకశిర, ధర్మవరం, పుట్టపర్తి, కదిరి నియోజకవర్గాల్లో టీడీపీ నుంచి వైఎస్సార్ సీపీ లోకి వలసలు విపరీతంగా పెరిగిపోయాయి. దీంతో అత్యధిక సీట్లు గెలుస్తామని ప్రగల్భాలు పలికిన నాయకులందరూ మౌనం పాటిస్తున్నారు. హిందూపురం పార్లమెంటు పరిధిలో పార్టీ ఉనికి కోల్పోతోందని, గతంలో గెలిచిన ఆ ఒక్క సీటూ ఈసారి కష్టమేనని అంతర్గత సమావేశాల్లో నేతలు బాహాటంగా చెబుతున్నారు.

పడిపోయిన టీడీపీ గ్రాఫ్..

2019 ఎన్నికల్లో హిందూపురం అసెంబ్లీ మినహా అన్ని స్థానాల్లో వైఎస్సార్ సీపీ జెండా ఎగిరింది. ఈసారి ఆ సీటు గెలవడం కూడా కష్టంగా ఉందని.. టీడీపీ గ్రాఫ్ మరింత పడిపోయిందని కార్యకర్తలు చెబుతున్నారు. నియోజకవర్గాల్లో గ్రూపు తగాదాలు పెరిగిపోయినా.. అధిష్టానం నివారించలేకపోవడమే కారణంగా భావిస్తున్నారు. జిల్లాలోని ఆరు మున్సిపాలిటీలు, 32 మండలాల్లో వైఎస్సార్ సీపీ ప్రాతినిథ్యం వహిస్తుండగా, టీడీపీకి ఎక్కడా బలం లేకుండా పోయింది. అంతేకాకుండా 'తమ్ముళ్ల' మధ్య సమన్వయం లేకపోవడంతో ఎమ్మెల్యే అభ్యర్థులకు కొత్త చిక్కులు వచ్చి పడ్డాయి. అధిష్టానం నిర్ణయించిన అభ్యర్థులకు ఎక్కడా సరైన మద్దతు లభించలేదు.

పొత్తు జీర్ణించుకోలేక..

జనసేనతో టీడీపీ పొత్తును తెలుగు తమ్ముళ్లు జీర్ణించుకోలేకపోతున్నారు. జిల్లాలో జనసేనకు ఏ ఒక్క పంచాయతీలోనూ బలం లేదని టీడీపీ నాయకులు చెబుతుండగా, 'టీడీపీకి బలంలేకే మా మద్దతు కోరింది' అని జనసేన కార్యకర్తలు కౌంటర్ ఇస్తున్నారు. సామాజిక మాధ్యమాల్లో ప్రారంభమైన ఈ ఆధిపత్య పోరు...హద్దులు దాటిపోతోంది. ఫలితంగా రెండు పార్టీల నాయకుల మధ్య వైరం ముదురుతోంది. దీంతో ఈ ఎన్నికల్లో రెండు పార్టీల నేతలు కలిసి పనిచేసే పరిస్థితి లేదని, ఈ నేపథ్యంలో టీడీపీ ఘోర ఓటమిని చవి చూడటం ఖాయమని రాజకీయ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

అధిష్టానంపై అలక..

తొలి జాబితాలో టీడీపీ జిల్లా అధ్యక్షుడు బీకే పార్థసారథి, పరిటాల శ్రీరామ్‌కు అవకాశం లేకపోవడంతో వారిద్దరూ అధిష్టానంపై అలకబూనారు. ఈ నేపథ్యంలోనే చంద్రబాబు తన సభను రాప్తాడు నుంచి పెనుకొండకు మార్చుకున్నారు. పెనుకొండలోనూ బీకే పార్థసారథి వర్గం గుర్రుగా ఉండగా, పార్టీ అభ్యర్థి సవితను ముందుపెట్టి సభ ఏర్పాట్లు చేయిస్తున్నారు.

ఇంటర్ పరీక్షకు 223 మంది గైర్హాజరు



పరీక్ష ప్రారంభానికి ముందు హిందూపురంలోని ఓ సెంటర్ వద్ద వేచి ఉన్న విద్యార్థులు

పుట్టపర్తి: ఇంటర్మీడియెట్ వార్షిక పరీక్షల్లో భాగంగా శనివారం జరిగిన ద్వితీయ సంవత్సరం లాంగ్వేజస్–2 పరీక్షకు 223 మంది విద్యార్థులు గైర్హాజరయ్యారు. జిల్లాలోని 41 కేంద్రాల్లో పరీక్ష నిర్వహించారు. మొత్తం 7,891 మంది (జనరల్) విద్యార్థులకు గాను 7,720 మంది హాజరయ్యారు. 171 మంది గైర్హాజరయ్యారు. ఒకేషనల్‌కు సంబంధించి 981 మందికి గాను 929 మంది హాజరయ్యారు. 52 మంది గైర్హాజరయ్యారని ఇంటర్మీడియెట్ విద్య అధికారి రఘునాథరెడ్డి, ఆర్‌ఐఓ సురేష్ తెలిపారు.

సునీల్‌ను మార్చాల్సిందే

- లేకపోతే పార్టీకి గుడ్ బై చెబుతాం
- తేల్చిచెప్పిన మడకశిర తెలుగు తమ్ముళ్లు



నిరసన తెలుపుతున్న టీడీపీ బూత్ కమిటీల ఇన్‌చార్జ్‌లు

మడకశిర: టీడీపీ మడకశిర అభ్యర్థి సునీల్‌ను మార్చాలని, లేకపోతే తామంతా పార్టీని వీడుతామంటూ మడకశిర తెలుగు తమ్ముళ్లు అధిష్టానానికి అల్టిమేటం జారీ చేశారు. మడకశిర అభ్యర్థి విషయంలో చంద్రబాబు తీసుకున్న నిర్ణయంపై పునరాలోచన చేయాలని మాజీ ఎమ్మెల్సీ గుండుమల తిప్పేస్వామి వర్గీయులు వారం రోజులుగా నిరసన కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. శనివారం కూడా నియోజకవర్గంలోని 237 బూత్ కమిటీల ఇన్‌చార్జ్‌లు పార్టీ కార్యాలయం ఎదుట బైఠాయించి నిరసన తెలిపారు. మాజీ ఎమ్మెల్యే ఈరన్న కుమారుడు సునీల్ కుమార్‌ను అభ్యర్థిగా ప్రకటించడం సరికాదన్నారు. వెంటనే అభ్యర్థిని మార్చాలని నినాదాలు చేశారు. లేకపోతే తమ పదవులకు రాజీనామా చేసి వచ్చే ఎన్నికల్లో పార్టీని ఓడిస్తామని తేల్చిచెప్పారు.

అద్దె గదులకు 11న బహిరంగ వేలం

పుట్టపర్తి అర్బన్: జిల్లా పర్యాటక శాఖ పరిధిలోని అద్దె గదులకు ఈ నెల 11న బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు జిల్లా పర్యాటక శాఖ అధికారి నాగేశ్వరరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రస్తుతమున్న స్థితిలో గదులను ఐదేళ్ల అద్దెకు కేటాయించనున్నట్లు పేర్కొన్నారు. మడకశిర పర్యాటక శాఖ భవనాలకు ఏడాదికి రూ.1.80 లక్షలు, గొల్లపల్లి రిజర్వాయర్, పెనుకొండ వద్దనున్న గదులు రూ.60 వేలకు బహిరంగ వేలం నిర్వహించనున్నట్లు వెల్లడించారు. వేలంలో పాల్గొనదలచిన వారు మడకశిర పర్యాటక శాఖకు రూ.2 వేలు, గొల్లపల్లి పర్యాటక శాఖకు రూ.1000 చొప్పున 'డిస్ట్రిక్ టూరిజం కౌన్సిల్, శ్రీసత్యసాయి జిల్లా' పేరు మీద డీడీ తీయాల్సి ఉంటుందన్నారు. ధరావత్తు మొత్తం తిరిగి ఇవ్వబడదన్నారు. టెండర్ ఫారాలు కలెక్టరేట్‌లోని పర్యాటక శాఖ కార్యాలయంలో ఈ నెల 11వ తేదీ సాయంత్రం 3 గంటల వరకూ పొందవచ్చని, అదే రోజు సాయంత్రం 5 గంటలకు బహిరంగ వేలం ఉంటుందన్నారు.

మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

పుట్టపర్తి: జిల్లాలోని మోడల్ స్కూళ్లలో 2024–25 విద్యా సంవత్సరానికి సంబంధించి ఆరో తరగతిలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని డీఈఓ మీనాక్షి తెలిపారు. ఇందుకోసం ఏప్రిల్ 21న ప్రవేశ పరీక్ష ఉంటుందన్నారు. ఈ నెల 31వ తేదీ వరకు www.cse.ap.gov.inలో దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. ఓసీ, బీసీలు రూ.150, ఎస్సీ, ఎస్టీలు రూ.75 రుసుం చెల్లించాలని పేర్కొన్నారు.

క్లుప్తంగా

ఏఎస్‌ఐలుగా పదోన్నతి



ఎస్పీ అన్బురాజన్‌కు కృతజ్ఞతలు తెలుపుతున్న ఏఎస్‌ఐలు

అనంతపురం: పలువురు హెడ్‌కానిస్టేబుళ్లకు ఏఎస్‌ఐలుగా పదోన్నతులు లభించాయి. శ్రీ సత్యసాయి జిల్లా పట్నం పోలీసు స్టేషన్‌లో పనిచేస్తున్న నూర్ మహమ్మద్, హిందూపురం రూరల్ పోలీస్ స్టేషన్‌లో పనిచేస్తున్న నీలవేణిలకు ఏఎస్‌ఐగా పదోన్నతి దక్కింది. నూర్ మహమ్మద్‌ను కనగానపల్లికి, నీలవేణిని గుంతకల్లు ఒన్ టౌన్ పోలీసు స్టేషన్‌కు బదిలీ చేశారు. వీరు జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులతో కలిసి అనంతపురం ఎస్పీ అన్బురాజన్‌ను శనివారం మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. వీరితో పాటు అన్నమయ్య జిల్లాలో పనిచేస్తూ ఇటీవల అనంతపురం ఏఆర్‌కు బదిలీ అయిన ఆర్ఎస్‌ఐ జాఫర్ పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యుడి హోదాలో ఎస్పీని మర్యాదపూర్వకంగా కలిశారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు అధికారుల సంఘం అడ్‌హాక్ కమిటీ సభ్యులు సాకే త్రిలోక్‌నాథ్, జాఫర్, సుధాకర్‌రెడ్డి, గాండ్ల హరినాథ్, తేజ్‌పాల్, శ్రీనివాసులు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

తప్పిపోయిన వృద్ధుడు మృతి



రామిరెడ్డి (ఫైల్)

చిలమత్తూరు: తప్పిపోయిన వృద్ధుడు రెండు వారాల తర్వాత విగతజీవిగా కనిపించాడు. వివరాలిలా ఉన్నాయి. డి.గొల్లపల్లికి చెందిన రామిరెడ్డి (70)కి మతిస్థిమితం లేదు. 15 రోజుల కిందట ఇంటి నుంచి బయటకు వెళ్లిపోయిన రామిరెడ్డి తిరిగి రాలేదు. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు ఎన్నిచోట్ల గాలించినా ప్రయోజనం లేకుండాపోవడంతో పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఇదిలా ఉండగా శనివారం గ్రామ సమీపంలోని అటవీ ప్రాంతంలో కుళ్లిపోయిన పురుషుడి మృతదేహాన్ని పశువుల కాపరులు గుర్తించి పోలీసులకు సమాచారమందించారు. బంధువులు, స్థానికులు సంఘటన స్థలానికి చేరుకుని రామిరెడ్డి మృతదేహాన్ని గుర్తించారు. అక్కడే పంచనామా నిర్వహించి మృతదేహాన్ని బంధువులకు అప్పగించినట్లు ఎస్‌ఐ గంగాధర్ తెలిపారు. రామిరెడ్డికి భార్య, కుమారుడు, కుమార్తె ఉన్నారు.

బిడ్డ పలికె.. అమ్మ మురిసె

తమ పిల్లలు వినలేరని, మాట్లాడలేరని పుట్టెడు దుఃఖంతో ఉన్న తల్లులకు జగన్ సర్కార్ అండగా నిలుస్తోంది. ఆరోగ్యశ్రీ ద్వారా రూ.లక్షలు విలువ చేసే శస్త్రచికిత్సలు ఉచితంగా అందించడంతో ఆ అమ్మల మోము మురుస్తోంది. తమ బిడ్డలకు భవిష్యత్ ప్రసాదించిన సీఎం జగన్‌కు రుణపడి ఉంటామని చెబుతున్నారు. ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని 'సాక్షి' ప్రత్యేక కథనం

- మూగ, చెవిటి పిల్లలకు జగన్ సర్కార్ అండ
- ఉచితంగా కాక్లియర్ ఇంప్లాంటేషన్ సర్జరీలు
- ఆరోగ్యశ్రీతో పైసా ఖర్చు లేకుండా వైద్యసేవలు

అనంతపురం మెడికల్: నవమాసాలు మోసి బిడ్డకు జన్మనిచ్చిన తల్లి ఆనందానికి అవధులుండవు. కానీ ఆ బిడ్డ అమ్మా అని పిలవకపోతే.. పలకరిస్తే ప్రతిస్పందించకపోతే... ఆ తల్లి పడే ఆవేదన అంతా ఇంతా కాదు. చెవిలోని కాక్లియా సరిగా పనిచేయకపోవడంతో మూగ, చెవిటితో ఇబ్బంది పడుతుంటారు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ ఆపరేషన్ ద్వారా వినికిడి ఇబ్బంది తొలగి.. మూగ, చెవిటి సమస్యకు పరిష్కారం లభిస్తుంది. కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్ర చికిత్స చేయించాలంటే ప్రైవేట్ ఆస్పత్రుల్లో రూ.12 లక్షల నుంచి రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుంది. అటువంటిది వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం రూ.లక్షలు విలువ చేసే ఖరీదైన శస్త్రచికిత్సలను ఆరోగ్యశ్రీ ద్వారా ఉచితంగా అందిస్తోంది. శస్త్రచికిత్స చేయడంతో పాటు రెండేళ్ల పాటు ఉచితంగా స్పీచ్ థెరపీ కూడా అందించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంది.



వినికిడి యంత్రాలను అందిస్తున్న అనంతపురం డీఎంహెచ్‌ఓ డాక్టర్ ఈ భ్రమరాంబ దేవి, చిత్రంలో సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు



కాక్లియర్ ఇంప్లాంటేషన్ ఆపరేషన్ చేయించుకున్న చిన్నారితో తల్లి

చిన్నారులకు మెరుగైన వైద్యం

- 3954 మందికి వినికిడి సమస్య గుర్తింపు

వినికిడి సమస్య కల్గిన చిన్నారులకు మెరుగైన వైద్యం అందిస్తున్నట్లు డీఎంహెచ్‌ఓ డాక్టర్ భ్రమరాంబదేవి పేర్కొన్నారు. శనివారం అనంతపురం ప్రభుత్వ సర్వజనాస్పత్రిలోని డీఈఐసీ సెంటర్‌లో ప్రపంచ వినికిడి దినోత్సవాన్ని పురస్కరించుకుని వినికిడి లోపంతో బాధపడుతున్న చిన్నారులకు యంత్రాలను అందించారు. డీఎంహెచ్‌ఓ మాట్లాడుతూ ఇప్పటి వరకు డీఈఐసీలో 3,954 మంది పిల్లలను పరీక్షించి సమస్య గుర్తించామన్నారు. పుట్టుకతో వినికిడి లోపం ఉన్న 454 మంది పిల్లలను గుర్తించి.. వారిలో 55 మందికి వినికిడి యంత్రాలను ఉచితంగా అందించామన్నారు. కార్యక్రమంలో ప్రభుత్వ సర్వజనాస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వరరావు, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, ఆరోగ్యశ్రీ జిల్లా కో ఆర్డినేటర్ డాక్టర్ కిరణ్‌కుమార్‌రెడ్డి, ప్రోగ్రాం ఆఫీసర్ డాక్టర్ నారాయణస్వామి, డీఈఐసీ మేనేజర్ రజిత, తదితరులు పాల్గొన్నారు.

ఉమ్మడి జిల్లాలో 34 శస్త్రచికిత్సలు..

వైఎస్సార్ కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పాటైన 2019 నుంచి ఇప్పటి వరకు ఉమ్మడి అనంతపురం జిల్లాలో 34 మంది చిన్నారులకు కాక్లియర్ ఇంప్లాంటేషన్ శస్త్రచికిత్సలు చేశారు. ఇందు కోసం ప్రభుత్వం రూ.1,63,40,600 ఖర్చు చేసింది. చెవి శస్త్రచికిత్స, స్పీచ్ థెరపీ, పరికరాల అమరిక తదితర వాటికి ఒక్కో చిన్నారికి రూ.8 లక్షల వరకు వెచ్చిస్తోంది.

అమ్మా అని పిలుస్తోంది!



తన బిడ్డ లలిత్యకు పునర్జన్మ ప్రసాదించారని చెబుతున్న రొళ్లకు చెందిన మణి

శ్రీసత్యసాయి జిల్లా రొళ్ల ప్రాంతానికి చెందిన మణి, ధ్రువకుమార్ దంపతులు. వీరి పెద్ద కుమార్తె లాలిత్య (5) పుట్టినప్పటి నుంచి శబ్దం గ్రహించేది కాదు. మాటలు కూడా రావు. అమ్మా అని పిలుపునకు నోచుకోక తల్లడిల్లిపోయిన తల్లిదండ్రులు.. కూతురును కర్ణాటకలోని తుమకూరు, బెంగళూరులోని పలు ఆస్పత్రుల్లో చూపించారు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ చేయాలని, అప్పుడే వినికిడి సమస్య పోతుందని, పాప మాట్లాడుతుందని వైద్యులు చెప్పారు. ఇందుకోసం రూ.12 లక్షలు ఖర్చవుతుందన్నారు. అంత డబ్బు సమకూర్చడం ఎలా అని ఆలోచిస్తున్న సమయంలో ఆరోగ్యశ్రీ గురించి తెలిసింది. ఈ ఏడాది జనవరిలో అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో చేర్పించి ఉచితంగా ఆపరేషన్ చేయించారు. 'అమ్మా అని పిలుస్తుంటే ఆనందంతో మది పులకించిపోతోంది. జగనన్నకు జీవితాంతం రుణపడి ఉంటామ'ని మణి చెబుతోంది.

ఆనందానికి అవధుల్లేవ్





కుమారుడు దేవాన్ష్‌ను చూసి మురిసిపోతున్న నరసింహారెడ్డి

రాప్తాడు మండలం యర్రగుంటకు చెందిన నరసింహారెడ్డి వ్యవసాయం చేసుకుని జీవనం సాగిస్తున్నాడు. ఈయనకు ఇద్దరు సంతానం. రెండో సంతానమైన నాలుగేళ్ల దేవాన్ష్ సింహారెడ్డి వినికిడి సమస్యతో బాధపడుతున్నాడు. రెండేళ్ల వయసులో కాక్లియా సమస్య ఉన్నట్లు బయటపడింది. కుమారుడిని బెంగళూరులోని ఆస్పత్రుల్లో చూపిస్తే చికిత్సకు రూ.15 లక్షల వరకు ఖర్చు అవుతుందని వైద్యులు చెప్పారు. మిత్రులు రూ.2 లక్షల వరకు ఆర్థిక సహాయం చేసేందుకు ముందుకు వచ్చినా.. మిగిలిన మొత్తం సర్దుబాటు కాలేదు. కాక్లియర్ ఇంప్లాంటేషన్ ఉచితంగా చేస్తారన్న సమాచారాన్ని పత్రికల ద్వారా తెలుసుకున్న నరసింహారెడ్డి అనంతపురంలోని ఓ కార్పొరేట్ ఆస్పత్రిలో కుమారుడిని చేర్పించాడు. ఆరోగ్యశ్రీ కింద పైసా ఖర్చు లేకుండా ఆపరేషన్ చేశారు. ఇప్పుడు కుమారుడు మాటలు వినడం.. మాట్లాడటం చేస్తుంటే ఆనందానికి అవధులు లేకుండాపోయాయని నరసింహారెడ్డి చెబుతున్నారు.

నవగ్రహ దేవత రజత ద్వారం ప్రారంభం



వాసవీ ధర్మశాలలో నూతనంగా నిర్మించిన నవగ్రహ రజత ద్వారం

హిందూపురం: పట్టణంలోని వాసవీ కన్యకాపరమేశ్వరీ ఆలయంలో నవగ్రహ దేవతా రజత ద్వారాన్ని శనివారం ప్రారంభించారు. తొలుత మూలవిరాట్ కన్యకాపరమేశ్వరీ దేవిని విశేషంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం నవగ్రహమూర్తులకు నిర్మించిన వెండి ద్వారాన్ని ప్రారంభించారు. వందలాది మంది ఆర్యవైశ్యులు తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ఆర్యవైశ్య సంఘం జిల్లా కార్యవర్గ ప్రమాణం..

శ్రీసత్యసాయి జిల్లా ఆర్యవైశ్య నూతన కార్యవర్గ కమిటీ ప్రమాణ స్వీకరణ మహోత్సవం అట్టహాసంగా జరిగింది. ఆర్యవైశ్యులు పురవీధుల్లో బైక్‌ర్యాలీ నిర్వహించారు. ఆర్యవైశ్య సంఘ మహాసభ అధ్యక్షుడు సత్యనారాయణ, గౌరవాధ్యక్షుడు జయంతి వెంకటేశ్వర్లు, సీనియర్ నాయకులు పోతుల సురేష్, పొలిటికల్ కమిటీ చైర్మన్ కోటా సత్యనారాయణ, ప్రధాన కార్యదర్శి కాల్వ రవీంద్రుడు తదితరులు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ నూతన కమిటీ ఆర్యవైశ్యులకు అండగా ఉంటుందన్నారు. ప్రస్తుత సార్వత్రిక ఎన్నికల్లో ఆర్యవైశ్యులను ఏ పార్టీ గుర్తించి టిక్కెట్లు ఇస్తుందో ఆ పార్టీకి ఆర్యవైశ్యుల పూర్తిసహకారం ఉంటుందన్నారు. అలాగే ఆర్యవైశ్య కార్పొరేషన్ ఏర్పాటు చేసి నిధులు కేటాయించాలని కోరారు. ఆర్యవైశ్యులకూ సంక్షేమ పథకాలు అందించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో ఆర్యవైశ్య జిల్లా, హిందూపురం వివిధ ప్రాంత సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరి దుర్మరణం





మృతులు రమేష్, నరసింహమూర్తి

తాడిమర్రి/ పెనుకొండ రూరల్: వేర్వేరు చోట్ల జరిగిన రోడ్డు ప్రమాదాల్లో ఇద్దరు వ్యక్తులు దుర్మరణం చెందారు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మవరం పట్టణంలోని జగ్జీవన్‌రామ్‌నగర్‌కు చెందిన తిమ్మయ్యగారి రమేష్ (45) శనివారం ద్విచక్ర వాహనంపై నార్పల వైపు నుంచి ధర్మవరం వెళుతున్నాడు. రాత్రి 8 గంటల సమయంలో తాడిమర్రి మండలం ఏకపాదంపల్లి బస్టాండు దాటుకుని కొంత దూరం వెళ్లిన తర్వాత వెనుక నుంచి లారీ ఢీకొంది. ఈ ప్రమాదంలో రమేష్ లారీ కిందపడి అక్కడికక్కడే మృతి చెందాడు. ఎస్‌ఐ నాగస్వామి ఘటనా స్థలానికి వెళ్లి కేసు నమోదు చేశారు.

- హిందూపురం మోడల్‌కాలనీకి చెందిన నరసింహమూర్తి మిత్రుడు రాజేష్‌తో కలిసి శనివారం బళ్లారి నుంచి కారులో హిందూపురం వస్తుండగా సోమందేపల్లి మండలం దుద్దేబండ క్రాస్‌లో అదుపు తప్పి డివైడర్‌ను గుద్దుకుని అదే వేగంతో బొలెరో వాహనాన్ని ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో నరసింహమూర్తి (42) అక్కడికక్కడే మృతి చెందాడు. రాజేష్ స్వల్పంగా గాయపడ్డాడు. కియా స్టేషన్ ఎస్‌ఐ రంగడు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ జంట ఆత్మహత్యాయత్నం

- ప్రేమికుడు మృతి
- ఆస్పత్రిలో కోలుకుంటున్న ప్రేమికురాలు

కంబదూరు: తమకు పెళ్లి చేయరేమోనన్న బెంగతో ప్రేమికులు ఆత్మహత్యాయత్నం చేశారు. వీరిలో ప్రేమికుడు మృతి చెందాడు. ప్రేమికురాలు చికిత్స పొందుతోంది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. కళ్యాణదుర్గం మండలం కామక్కపల్లికి చెందిన హరిజన హరిభూషణం (26) అదే గ్రామానికి చెందిన త్రిష అనే యువతిని ప్రేమించాడు. ఇద్దరూ గత నెల 28న పెళ్లి చేసుకుందామని ఇంటి నుంచి వెళ్లిపోయారు. కంబదూరు మండలం గుద్దెళ్ల గ్రామంలోని హరిభూషణం మేనమామ ఇంటికి వెళ్లి పెళ్లి విషయమై చర్చించారు. ప్రేమికులిద్దరినీ పోలీసులకు స్టేషన్‌కు తీసుకెళ్లి పెళ్లి చేయాలని నిర్ణయించారు. ఏమైందో ఏమో తెలియదు కాని శనివారం ఉదయం హరిభూషణం గుద్దెళ్ల గ్రామ సమీపంలోని పొలంలోకి వెళ్లి కానిగ చెట్టుకు ఉరి వేసుకున్నాడు. హరిభూషణం ఆత్మహత్య చేసుకున్న విషయాన్ని తెలుసుకున్న త్రిష కూడా మామిడి కాయలకు స్ప్రే చేసే పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసింది. బంధువులు గమనించి త్రిషను కళ్యాణదుర్గం ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఆరోగ్యం నిలకడగా ఉన్నట్లు వైద్యులు తెలిపారు. ఎస్‌ఐ ఆంజనేయులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

గుడిబండ: తూనికలు, కొలతల శాఖ అధికారులు శనివారం మండలంలోని వివిధ చౌకదుకాణాలు, ఫర్టిలైజర్ షాపులను తనిఖీ చేశారు. ప్రభుత్వచౌకదుకాణాల్లో రేషన్ సరుకులను సరైన తూకాల్లో కార్డుదారులకు అందించాలన్నారు. ఫర్టిలైజర్ షాపుల్లో ఎరువులు, పురుగుమందులను అధిక ధరలకు విక్రయిస్తే చట్ట రీత్యా చర్యలు తీసుకుంటామని తూనికలు, కొలతల శాఖ సీఐ శివశంకర్ తెలిపారు.

మునక్కాయలకెళ్లి మృత్యువాత

సోమందేపల్లి: మునక్కాయల కోసం చెట్టు ఎక్కి కాలుజారి ఒకరు మృత్యువాత పడ్డారు. జూలకుంటకు చెందిన హనుమంతరాయుడు (65) శుక్రవారం సాయంత్రం తన పొలంలో మునక్కాయల కోసం చెట్టు ఎక్కాడు. కాయలు తొలగించే క్రమంలో కాలుజారి కిందపడటంతో తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబ సభ్యులు గమనించి హిందూపురం ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమించడంతో హనుమంతరాయుడు శనివారం మృతి చెందాడు. ఇతడికి భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు.

సీఐఎస్ఎఫ్ కానిస్టేబుల్ మృతి



మృతుడు మనోహర్

గుత్తి: జక్కలచెరువు గ్రామ సమీపంలో గత నెల 24న జరిగిన రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన సీఐఎస్ఎఫ్ (సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్) కానిస్టేబుల్ మనోహర్ (32)ను మెరుగైన వైద్యం కోసం శనివారం అనంతపురం నుంచి బెంగళూరుకు తరలిస్తుండగా మార్గం మధ్యంలో మృతి చెందాడు. మృతుడు పెద్దవడుగూరు మండలం కదరగుట్టపల్లికి చెందిన వ్యక్తి. ఈయనకు భార్య, యేడాది వయసున్న కుమారుడు ఉన్నారు. ఎస్‌ఐ నబి రసూల్ కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గిరిజనుల సమస్యలు పరిష్కరించాలి

- కలెక్టర్‌ను కోరిన రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు శంకర్‌నాయక్



మాట్లాడుతున్న ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్, కలెక్టర్ అరుణ్‌బాబు

పుట్టపర్తి అర్బన్: గిరిజనులు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి, వాటి పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ అరుణ్‌బాబును రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యుడు వడిత్యా శంకర్‌నాయక్ కోరారు. శనివారం పుట్టపర్తికి విచ్చేసిన ఆయన కలెక్టరేట్‌లో కలెక్టర్‌ను కలిసి గిరిజనుల సమస్యలపై చర్చించారు. ముదిగుబ్బ మండలం జొన్నలకొత్తపల్లి తండాలో రోడ్డు లేక ప్రజలు ఇబ్బంది పడుతున్నారన్నారు. అమడగూరు మండలం పూలకుంటపల్లి పంచాయతీ దాదియవారిపల్లి తండాకు చెందిన భూక్యా వెంకటరమణ నాయక్ హత్యకు గురయ్యాడని, ఆయన కుటుంబానికి ఆర్థిక సహాయం అందించడంతో పాటు కుమారునికి ఏదైనా ప్రభుత్వ ఉద్యోగం కల్పించి ఆదుకోవాలని విజ్ఞప్తి చేశారు. తండాలలో తాగునీరు, మౌలిక వసతులు కల్పించాలని కోరారు. జలజీవన్ మిషన్ ద్వారా ఇంటింటికీ సురక్షితమైన తాగునీటి కుళాయిలు ఏర్పాటు చేయాలన్నారు. ఎస్టీ నిధుల ద్వారా మంచినీటి బోర్లు, అంగన్‌వాడీ కేంద్రాలు, పీహెచ్‌సీలు, శ్మశాన వాటికలు, పాఠశాలల ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఇందుకు కలెక్టర్ స్పందిస్తూ అన్నింటినీ పరిశీలించి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. సమావేశంలో డీఆర్ఓ కొండయ్య, గిరిజన సంక్షేమ శాఖ జిల్లా అధికారి మోహన్‌రాం, ముదిగుబ్బ జెడ్పీటీసీ సేవేనాయక్, గిరిజన సంక్షేమ సంఘం నాయకులు మల్లికార్జున నాయక్, కృష్ణానాయక్, సుధాకర నాయక్, ప్రసాద్ నాయక్, లక్ష్మీనాయక్ తదితరులు పాల్గొన్నారు.

జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ విజేత కడప



విజేత జట్లను అభినందిస్తున్న కలెక్టర్ గౌతమి ఎం. గౌతమి

అనంతపురం: శ్రీ సత్యసాయి జర్నలిస్ట్ క్రికెట్ యూనిటీ కప్-2024 విజేతగా కడప జట్టు నిలిచింది. అనంతపురం ఆర్డీటీ క్రీడా గ్రామంలో నిర్వహిస్తున్న క్రికెట్ టోర్నీ శనివారం ముగిసింది. కడప, వైజాగ్ జట్ల మధ్య ఫైనల్ మ్యాచ్ జరిగింది. కడప జట్టు విజేతగా నిలవగా.. వైజాగ్ జట్టు రన్నర్స్‌గా నిలిచింది. విజేతలకు ముఖ్య అతిథి కలెక్టర్ గౌతమి ట్రోఫీలు అందజేశారు. అలాగే బెస్ట్ బ్యాట్స్‌మెన్, బెస్ట్ బౌలర్, మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్, మ్యాన్ ఆఫ్ ది సిరీస్ ట్రోఫీలను, టోర్నమెంట్‌లో పాల్గొన్న జట్ల సభ్యులకు మెడల్స్‌ను అందించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఐపీఎల్ తరహాలో ఏపీడబ్ల్యూజే రాష్ట్ర అధ్యక్షుడు మచ్చా రామలింగారెడ్డి జర్నలిస్ట్ క్రికెట్ టోర్నీ నిర్వహించడం సంతోషదాయకమని అన్నారు. పని ఒత్తిడితో ఉండే జర్నలిస్టులకు క్రీడలు మానసికోల్లాసం కలిగిస్తాయన్నారు. కార్యక్రమంలో అమరావతి హాస్పిటల్ ఎండీ ముత్యాలు, సీనియర్ జర్నలిస్టులు మార్కండేయులు, నాగభూషణం, రాచమల్లు భోగేశ్వర రెడ్డి,రసూల్ తదితరులతో పాటు ఆర్గనైజింగ్ కమిటీ సభ్యులు ఖాన్, విజయరాజు, షాకీర్, రఘు, శ్రీకాంత్, చక్రి, భీమా, శివప్రసాద్, రవి, సాదిక్, ఈశ్వర్, సాయి, త్యాగరాజు, వాలి తదితరులు పాల్గొన్నారు.

విహార యాత్రలో విషాదం

- సముద్రంలో ఇద్దరు 'తాడిపత్రి' విద్యార్థుల గల్లంతు

యాడికి: విహార యాత్రలో విషాదం చోటుచేసుకుంది. అంత వరకూ ఆనందంగా గడిపిన వారిలో ఆవేదన నింపింది. వివరాలు.. యాడికి మండలం కుందనకోట గ్రామానికి చెందిన పెద్దయ్య, లక్ష్మీదేవి దంపతుల కుమారుడు పెద్దిరాజులు, పెద్దవడుగూరు మండలం అప్పేచెర్ల గ్రామానికి చెందిన వెంకటరామిరెడ్డి, వెంకటలక్ష్మి దంపతుల కుమారుడు శేషారెడ్డి స్థానిక పెన్నా సిమెంట్ కర్మాగారం కళాశాలలో డిగ్రీ ఫైనల్ ఇయర్ చదువుతున్నారు. రెండు రోజుల క్రితం తమ స్నేహితులు 22 మందితో పాటు పాటు నలుగురు అధ్యాపకులతో కలిసి తమిళనాడు రాష్ట్రంలోని మహాబలిపురానికి విహారయాత్రకు వెళ్లారు. శనివారం ఒడ్డున నిలబడి సముద్రాన్ని చూస్తుండగా, రాకాసి అల వచ్చి వీరిని సముద్రంలోకి లాక్కెళ్లింది. వెంటనే అప్రమత్తమైన తోటి స్నేహితులు, అధ్యాపకులు స్థానిక జాలర్లకు సమాచారం చేరవేశారు. వారు వచ్చి వెతికినా ఇద్దరి ఆచూకీ లభ్యం కాలేదు. తమ కుమారులు సముద్రంలో గల్లంతయ్యారనే సమాచారం అందుకున్న విద్యార్థుల తల్లిదండ్రులు శనివారం రాత్రి మహాబలిపురానికి తరలివెళ్లారు. ఈ క్రమంలోనే ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా యాడికి సీఐ రోషన్, పోలీసు సిబ్బంది పెన్నా సిమెంటు కళాశాల వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు.



కుందనకోట పెద్దిరాజులు



అప్పేచెర్ల శేషారెడ్డి